
# తండ్లాట



పిల్లలు ఇంటికచ్చి అప్పుడే వారంరోజుల సెలవులు అయిపోయినయి. వాళ్లు నిన్నమొన్ననే వచ్చినట్టుంది. పిల్లలు వచ్చినంక వాళ్ల ఫ్రెండ్స్ రాకపోకలతో ఇల్లంతా సందడిగా ఉండె! సిటీకి వెళ్లడానికి తయారవుతున్నరు. ఈ వారంరోజులు వాళ్ల అమ్మ రకరకాల వంటలు చేసి పెట్టింది. మటన్, చికెన్, ఫిష్, బిర్యాని, పల్లి పట్టీలు, కరిజెలు, జాబూన్‌లు, సేమియా, పూస, పకోడి... రోజుకో తీరున చేసి పెట్టింది. మెస్ తిండితో మొహం వాచిన మా అబ్బాయి వాళ్ల అమ్మ చేతి వంటలు ఆవురావురుమంటూ తినేవాడు.

"అమ్మా నువ్వు ఎల్లిపాయ కారం, నూనెతో అన్నం బెట్టిన ఎంతో కమ్మగుంటది"అని మావాడు వంట గదిలో వాళ్లమ్మతో అంటుంటే నవ్వొచ్చింది. వాడికిప్పుడు అమ్మ భోజనం అంటే ఏమిటో తెలుస్తోంది. పిల్లలు ఈ వారం రోజులు టి.వి. సినిమాలు, ఫ్రెండ్స్, చుట్టాలు... జాలీగ గడిపిండ్రు. మావాడు ఇంటి పట్టున ఉంటే పొద్దస్తమానం కుర్చీకి అతుక్కుపోయి టి.వి.కి కళ్లు అప్పగించేవాడు. క్రికెట్ అంటే పడి చస్తాడు. లిటిల్ మాస్టర్ సచిన్ అంటే పిచ్చి అభిమానం. ఇపుడు ధోని హవా!

వరల్డ్‌కప్-20 ఇండియా టీంకు ధోని క్యాప్టెన్సీ. టి.వి.లో కోట్లాది ప్రజలు మ్యాచ్‌ను ఉత్కంఠతో చూస్తున్నారు. ఇండియా, పాకిస్తాన్ మ్యాచ్ నడుస్తోంది. నువ్వా, నేనా అన్నట్టు ఉంది. ఉద్విగ్న క్షణాలు. అనూహ్యమైన క్లైమాక్స్. ఇండియా గెలుపు. అదో మిరాకిల్! బుల్లితెరల కేరింతలు.

టి.వి. విషయంలో పిల్లలిద్దరు తరచు గొడవపడేవాళ్లు. వాడికేమో స్పోర్ట్స్ చానెల్ అంటే ఇష్టం. అమ్మాయికేమో 'ఆట','డాన్స్ బేబి డాన్స్', 'ఝుమ్మంది నాదం', 'పాడుతా తీయగా'లాంటి ప్రోగ్రామ్స్ ఇష్టం. వాడితో తగవు పెట్టుకోలేక ఆఖరికి అమ్మాయే రాజీపడేది. ఆ అమ్మాయికోసం ఇంటికి తన చిన్ననాటి స్నేహితురాండ్రు వస్తున్నారు. గంటలకొద్దీ ముచ్చట్లు... నవ్వులు... కేరింతలు...! మధ్య మధ్యలో ఫోన్ కాల్స్, యస్.ఎమ్.ఎస్.లు...! అమ్మాయి చెవిదగ్గర సెల్ పెట్టుకొని కాలిగాలిన పిల్లిలా ఒకటే పచార్లు చేసేది. మొబైల్ చెవి దగ్గర మరో పెద్ద చెవి అతికినట్లు ఉండేది.

'సెలవులకు వచ్చింద్రు! సరదాగ గడపనీయి' అని ఏ పని గూడ పిల్లలకు చెప్పకపోయేది వాళ్ల అమ్మ.

నాకు ఆఫీసు పనితోటి తీరికపోయేది. ఉదయం, సాయంత్రం జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, ఫ్రెండ్...ఎవరో ఒకరు ఏదో పనిమీద ఇంటికి వచ్చేవాళ్లు. టైమంతా ఉట్టిగనే గడిచిపోయేది. సాయంత్రం అలసిపోయి ఇంటికి వస్తే సాహితీ మిత్రులు...చర్చలు...! పిల్లలతో సంతోషంగా గడిపిన క్షణాలు తక్కువే!

అబ్బాయి బి.టెక్. 'మెకానికల్' ట్రేడ్‌తో పూర్తిచేశాడు. సిటీలో ఆటోకాడ్, కాడియా, ఎచ్.వి.ఎ.సి. మెకానికల్‌కు సంబంధించిన ప్యాకేజెస్ నేర్చుకుంటున్నాడు. నెట్ ద్వారా కంపెనీలకు రెజ్యూమ్‌లు పంపిస్తున్నాడు. ఇంటర్వ్యూలు అటెండ్ అవుతున్నాడు. బాలానగర్‌లోని మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనే ఓ కంపెనీలో డిజైన్ ఇంజనీరుగా ఉద్యోగం వచ్చింది.

"నాన్న ఏం చేయమంటవ్?" ఫోనులో అడిగిండు మా అబ్బాయి. "ఫస్ట్ యు హావ్ టు గెట్ ఎక్స్‌పీరియన్స్". జాయిన్ కమ్మని సలహా ఇచ్చాను. జాయిన్ అయి వర్క్ చేస్తున్నాడు. ఓ పక్క జాబ్ చేస్తూనే మరో పక్క పెద్ద కంపెనీలో ఎంట్రీ కొరకు ప్రయత్నం మానలేదు. రిటెన్ టెస్టులు, గ్రూప్ డిస్కషన్‌లు, హెచ్.ఆర్.లు... ఏవేవో పాల్గొంటున్నాడు. పోటీ ప్రపంచం. ఆఫ్ ది క్యాంపస్ సెలెక్షన్ కష్టతరమే! విసిగిపోకుండా బట్టివిక్రమార్కునిలా తన ప్రయత్నం కొనసాగిస్తున్నాడు.

ఓ రోజు అకస్మాత్తుగ మా వాడి నుంచి ఫోను.

"నాన్న 'ఎవినియాన్' అనే మల్టీ నేషనల్ కంపెనీలో అపాయింట్‌మెంటు వచ్చింది." అని సంతోషంగ చెప్పిండు.

"వెరీహాపీ! కంగ్రాట్స్! హియర్ ఆన్ వార్డ్స్ డెవలప్ యువర్ క్యారీర్...! ప్రూవ్ యువర్ సెల్ఫ్" ప్రోత్సహించాను.

మెకానికల్ లైన్లో వాడి ప్రయత్నాలు చూసి మొదట్లో విసిగిపోయాను. ఓ దశలో "అరే నానా అంతా సాఫ్ట్‌వేర్ సైడ్ మారుతున్నారు. వై డోంట్ యు టర్న్ టు సాఫ్ట్‌వేర్ సైడ్" అని.

"నో డాడ్ ఐ కాంట్ చేంజ్. ఐ లర్న్డ్ ఆటోకాడ్, కాడియా ఎక్స్‌ట్రా విచ్ ఆర్ లేటెస్టు ప్యాకేజెస్ రిలేటెడ్ టు మెకానికల్ విచ్ హావ్ బ్రయిట్ ఫ్యూచర్" అని చెప్పిండు.

"ఓకే నీ ఇష్టం", అని ఊర్కొన్నాను.

ఈమధ్య పంథా మార్చుకున్నాను. పిల్లల ఇష్టాయిష్టాలకు భిన్నంగా ఏదీ మాట్లాడడ్డం లేదు. ఏమీ చేయడం లేదు. చిన్నప్పుడు వాళ్లమీద క్రమశిక్షణ పేరుతో నా పద్ధతులన్నీ, నా అభిప్రాయాల్నీ బలవంతంగా రుద్దాను. వాళ్ల మాటల్ని లెక్కలోకి తీసుకునేవాణ్ణి కాదు. ఇప్పుడు వాళ్లు పెద్ద వాళ్లయ్యారు. పరిస్థితులు, పరిసరాలు, పద్ధతులు అన్నీ మారినయి. పిల్లల మనోభావాలను వింటున్నాను. ఆలోచిస్తున్నాను. అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తున్నాను. చాలవరకు రాజీపడుతున్నాను. జనరేషన్ గ్యాప్ వల్ల ఆలోచనా విధానంలో తేడా! పాస్టు జనరేషన్ గదా!

మనస్సు పాత రోజుల్లోకి వెళ్లిపోతోంది. అవి కాలేజి రోజులు. ఓ సుందర స్వప్నం. రంగుల ప్రపంచం. హాస్టల్ జీవితం. క్యూలో స్నానాలు! క్యూలో మెస్ భోజనం! ర్యాగింగ్‌లు, చిలిపి చేష్టలు, సినిమాలు, శికార్లు. గ్రూప్ తగాదాలు, లెక్చరర్ల మందలింపులు, హిత బోధలు, పికినిక్‌లు, ఎడ్యుకేషన్ టూర్‌లు, ఇండస్ట్రీ విసిట్‌లు..., ఎగ్జామ్స్..., రేయింబవళ్లు చదువులూ..., వీడ్కోలు... బెడ్డింగ్ సర్దుకుని హాస్టల్‌నుండి వెళుతుంటే ఎన్నో జ్ఞాపకాలు... గుండెల్ని తడిమాయి. కనురెప్పల మాటున కన్నీళ్లు ఎదను కల్లోల పరిచినయి. వీడ్కోలు సమయంలో స్నేహితుని మాటలు గుర్తుకు వస్తున్నాయి. స్నేహ కెరటాల తీరంనుండి కొత్త ప్రస్థానానికి సాదరంగ సాగనంపేది వీడ్కోలు! అది ఆత్మీయ అనుబంధాల జ్ఞాపిక! గుండెల్లో గూడు కట్టుకున్న ఉద్వేగాల నేపథ్యం! ఏళ్లతరబడి పెనవేసుకున్న మైత్రి! వీడ్కోల్లో మాటలు తడబడటమే తరువాయి...!!

పిల్లలు సిటీకి బయలుదేరుతుంటే గతస్మృతుల శకలాలు కళ్లముందు కదలాడి గుండె బరువెక్కింది. అమ్మాయి హైదరాబాద్‌లో బి.టెక్. ట్రిబుల్ 'ఇ' ఫస్టియర్‌లో జాయినయింది. అమ్మాయి ఎప్పుడు ఊరు వదిలి వెళ్లలేదు. ఆమె సిటీకి వెళుతోంటే మనసంతా ఆందోళనగా ఉంది. ఇపుడు సిటీ వాతావరణం అంటేనే భయమేస్తోంది. ఒకప్పుడు శాంతి భద్రతలతో, భిన్నత్వంతో ఏకత్వంగా విలసిల్లిన హైదరాబాద్ నేడు బాంబ్ బ్లాస్టింగ్-లు, మర్డర్లు, రాబింగ్-లు, రాగింగ్-లు, రేపింగ్-లు, ఈవ్ టీజింగ్-లు, కిడ్నాప్-లు, సెక్స్ హర్రాస్మెంట్లు, మతోన్మాదం పెచ్చరిల్లుతున్నాయి. ఉగ్రవాదులకు నెలవయింది. భద్రత కరువయింది. అమ్మాయి సిటిలో ఎట్ల మసలుకుంటుందోనన్న దిగులు కుంగదీస్తోంది.

దసరా తర్వాత అబ్బాయి మల్టి నేషనల్ కంపెనీలో

– పంజాల జగన్నాథం



★ భూర్జ (భుజపత్ర) 3-5 గ్రాములు ఉదయం- సాయంత్రం సేవిస్తే మేధో రోగమునందు ఉపయుక్తంగా వుంటుంది.

డిజైన అండ్ ప్రొడక్షన్ ఇంజనీరుగా చేరిండు. హాస్టల్లో ఉంటూ జాబ్ చేస్తున్నడు. వాడు ఓసారి ఫోన్‌చేసి 'నాన్న జాబ్ రీత్యా రకరకాల మనుషుల్ని కలుస్తున్నాను. భిన్న భాషలు... భిన్న సంస్కృతులు, సాంప్రదాయాలు..., విభిన్న మనస్తత్వాలు..., భిన్నాభిప్రాయాలు... జీవితం అంటే ఏమిటో ఇపుడిపుడే అర్థమవుతోంది. నాన్న మెట్టు మెట్టు ఎక్కి జీవితంలో నీకంటు ఓ ఇమేజిని ఏర్పరచుకో వటానికి ఎంత కష్టపడ్డవో ఊహించుకోగలుగుతు న్నాను'. అంటూ ఓ చిన్నపాటి ఉపోద్ఘాతమే ఇచ్చిండు.

మా వాడికి బి.టెక్. ఫైనల్‌లో ఉండంగ క్యాంపస్ సె-లెక్షన్ మిస్ అయింది. ఆ- తర్వాత పట్టుదల పెరి గింది. ఏదో సాధించాలన్న తపన..! ఏదో లక్ష్యం...! ఏదో గమ్యం...! జి.ఆర్, టోఫెల్, గేట్... ఎక్స్‌ట్రా, ఎక్స్‌ట్రా... ఏవేవో ఎగ్జామ్స్ వీజాలు, పాస్‌పోర్టులు. స్టేట్స్‌కు పోవా లన్న వాడి బలమైన కోరికను జూసి "నానా అక్కడ కూడ మాంద్యం ఏర్పడింది. అక్కడి ప్రాజెక్టులు ఇండియాకు వస్తున్నాయి. ఇక్కడ తక్కువ పేమెంట్సుతో చేసుకుని తీసుకెళుతుండ్రు. ఉద్యోగావకాశాలు ఇక్కన్నే మెరుగాయి నయి"అని చెప్పాను. మనసు మార్చుకున్నడు. హైదాబా ద్‌ల్నే ఉద్యోగం జూసుకున్నడు.

* * *

పిల్లలు సిటీకి వెళ్లిపోయిండ్రు. సందడిగా ఉన్న ఇల్లంతా బావురుమంటోంది. వసారాలో నీరెండ. తుమ్మెద ఝుమ్మంటోంది. మా ఆవిడ, నేను ఎవరి పనుల్లో వాళ్లం బిజీ అయిపోయినం. అంతా రొటీన్. నాకు ఆఫీసు పనులు. మా ఆవిడకు వంటిల్లు సామ్రాజ్యం. నాకు ఆఫీసులో..., ఇంట్లో ఫైళ్లతో తలమున కలవడం...! ఆవిడకేమో టీవీ... పొరుగువాళ్లు... ముచ్చట్లు... నాకు ఎప్పుడూ ఏదో అడ్మినిస్ట్రేటివ్ చికాకు...! మనసు బాగోలేకపోతే పుస్తకం నాతోడుం టుంది. తీపి కబుర్లు చెబుతుంది. మనస్సును శాంతిప రుస్తుంది. బావావేశం వస్తే పెన్నుకు పని చెబుతుంట... పత్రికలకు పంపిస్తుంట...!

"ఏంది గీబతుకు! ఓ గుడి లేదు. గోపురం లేదు. చుట్టాల మార్గం లేదు. యాత్రల్లేవ్. వేములవాడనో, కొండగట్టో, యాదగిరిగుట్టో పోదామంటే సప్పుడు జెయ్యవ్. ఎప్పుడు ఆఫీసు, ఆఫీసు..." వంటింట్లోంచి వస్తూ ముఖానికి పట్టిన చెమట తుడుచుకుంటు చిమ చిమలాడింది నా అర్ధాంగి. ఆమెలో అసహనం పెరిగిపో తోంది.

ఔను నిజమే...! ఎవరికి చెప్పుకోను నా పరిస్థితి. అడ్మి నిస్ట్రేటివ్ జాబ్‌వల్ల తీరిక చిక్కడం లేదు. ఆమెను ఎక్క డికి తీసుకలేకపోతున్న! హృదయపు లోతుల్లోంచి సంసారపు వృక్షానికి చిక్కి పెనుగులాడుతున్న! ఎందుకు నన్నునేను పోగొట్టుకుంటున్న! బైటపడలేకపోతున్న! ప్రకృతికి దూరమవుతున్న! జీవకళ తెలియడంలేదు! మనసులో మా ఆవిడ మాటలు తిరుగుతున్నయి.

స్టాఫ్ సరిగాలేదు. పెండింగ్ పేరుకుపోయింది. ఆఫీ సంతా అస్తవ్యస్తంగా తయారయింది. పనిభారం పెరి గింది. ఇంటికి సంబంధించిన ఏ విషయాలు పట్టించుకో వడం లేదు. కిరాణా సామాన్లు, కాస్మోటిక్స్ కాన్నించి అన్నీ ఆవిడనే చూస్తోంది. నా జీవన శైలితో ఆమె ఎంతో విసిగిపోయింది.

ఈమధ్య మా ఆవిడ నగలు, ఫర్నిచర్ మోజులో పడి పోయింది. పులిని జూసి నక్క వాత పెట్టుకుంటున్నట్లు... అనుకరిస్తే ఎట్ల మన పరిస్థితి ఆలోచించొద్దు! వాళ్ల వాళ్ల ఆర్థిక స్థితిగతులనుబట్టి కోరికల ప్రకారం నగలు, వస్తు వులు, ఫర్నిచర్ ఉంటాయని చెబితే వినిపించుకోదే!

"మన టి.వి. స్టాండ్ చెడిపోయింది. డొల్లుతుంది. కొత్త టి.వి. స్టాండ్ కొందాం."అని నన్నడిగింది.

"ఈ స్టాండ్‌కేమయింది. ఓ చిన్న మొలకొడితే సరిపో తుంది. దానికి నాలుగువేలు పెట్టి డీలక్స్ టి.వి.స్టాండ్ కొనాల్నా!" అంటే చిన్నబుచ్చుకుంది. మాటలు మానే సింది. కొన్ని రోజులు ముభావంగ ఉంది. తర్వాత అర్థం చేసుకుంది. అలక వీడింది. నాకు మటుకు ఆడంబరాలు ఇష్టముండవ్. బురద బతుకులు, రోడ్డుమీది బతుకులు కళ్లల్లో కదులుతుంటయి. ఇట్లాంటి ఖర్చులు దుబారా అనిపిస్తుంటది. అప్పుడప్పుడు జీవితంమీద విరక్తి కలి గేది. నాకనిపిస్తుండేది మనిషికి రెండు చోట్లనే శాంతి లభిస్తుందనీ...! ఒకటి తల్లి గర్భంలో, ఇంకోటి చితి మీద!!

అప్పుడప్పుడు మామధ్యన చిన్న చిన్న గొడవలు జరు గుతునే ఉన్నాయి. భార్యాభర్తలన్నాక, సంసారమన్నాక అవి మామూలే. ఈమధ్య ఆమెలో మార్పు వచ్చింది. దైవచింతన ఎక్కువయింది. గంటలకొద్దీ పూజలు పున స్కారాలు! గుళ్లు, గోపురాలు...భక్తిలో మునిగిపోతోంది. మాటాముచ్చట తగ్గింది. ఏ మఠంలోనన్నా కలిసిపో తుందా...! అన్న భయం కలిగేది. బహుశ ఎప్పుడు నేను ఫైళ్లలో మునిగి పోవడం ఒక కారణమేమోనని అనిపిం చేది.



**"ఏంది గీబతుకు! ఓ గుడి లేదు, గోపురం లేదు. చుట్టాల మార్గం లేదు. యాత్రల్లేవ్. వేములవాడనో, కొండగట్టో, యాద గిరిగుట్టో పోదామంటే సప్పుడు జెయ్యవ్. ఎప్పుడు ఆఫీసు, ఆఫీసు..."**

అప్పుడప్పుడు పిల్లలనుంచి వచ్చే ఫోన్లు కొంత ఊరటనిచ్చేవి. అమ్మాయి రెగ్యులర్‌గా ఫోను చేసేది. గలగల మాట్లాడేది. ఆమె తత్వమే అంత. అబ్బాయికి ఫోను విషయంలో అశ్రద్ధ ఎక్కువ. ఏదైనా ముఖ్యమనుకుంటే, డబ్బు అవసరముంటే చేస్తడు. ముక్తస రిగ మాట్లాడుతడు. వాడినించీ ఫోను వస్తే మంచి చెడ్డలు, యోగక్షేమాలు. ఆరోగ్యసమస్యలు అడిగి తెలుసుకుంటడనీ ఆశించేది. నిరాశే ఎదురయ్యేది. హాస్టల్లో ఉంచి చదివిస్తే గిట్లనే ఉంట దేమో బంధాలు అనుబంధాలు...! క్రమశిక్షణ పేరుతో కఠినంగ వ్యవహరించిన. గుండెకే గీ తరీకన తయార వుతందనిపిస్తుంది.

అప్పుడప్పుడు మావాడు తన స్నేహితులతో ఫీలయ్యే వాడట.

'చిన్నప్పుడు మా నాన్న చెప్పినట్లు బుద్ధిగా చదువుకో లేక నాలెడ్జిపరంగ వెనుకబడి పోయాననీ..., ఆఫ్ ద కాంపస్ జాబ్ వెతుక్కోవడానికి నానా యాతన పడాల్సి వచ్చిందనీ...!!' నిజమే వాడు పదో తరగతిలో చాల ఇబ్బంది పెట్టాడు. వాడికి క్రికెట్ పిచ్చి ఎక్కువ ఉండే! ఎప్పుడు చూసినా గ్రౌండ్‌లోనే కనబడేవాడు బ్యాట్ పట్టుకుని..! స్నేహాలు వాడిని చదువుకు దూరం చేశా నయి. వాణ్ణి దార్లోపెట్టడానికి ఎంత తిప్పలు పడ్డనో...! ఎన్ని రాత్రులు నిద్ర లేకుండ ఆలోచించిన్నో...!! ఆ ఏజ్ గ్రూప్ పిల్లల మనస్తత్వం అట్లనే ఉంటుందనీ దోస్తులు చెప్పినా మనస్సులో ఆరాటం తగ్గకపోయేది.

నేను ఇప్పటికీ చెబుతూ ఉంటాను. "బాబూ నానా! గతం గతించిన దాని గురించి చింతించకు. భవిష్యత్ ముందుంది. ఉన్నతమైన లక్ష్యం, నిర్దిష్టమైన గమ్యం ఏర్పరుచుకో శ్రమించు! సాధించు! నీ కుటుంబానికీ, నీ ఊరికి, నీ దేశానికి సేవ చేయి...!' అని. ఆ మాటలు మా వాడిని బాగా ప్రభావితం చేసినయి. మంచి కంపెనీకోసం ప్రయత్నం చేస్తున్నడు. చార్మింగ్ సాలరీస్ ఉంటయనీ... సొసైటీల రెస్పెక్ట్ ఉంటుందనీ...?! డ్యూటి పట్ల సిన్సియ ర్‌గ ఉంటూ హార్డ్ వర్క్‌కు ప్రొఫిసియన్సీ తోడయితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చనే థియరీ ఈ కాలపు యువత ఒంటబట్టించుకుంటుంది.

ఏవేవో ఆలోచనలు ముసురుకుంటున్నయి. ఇంతలో 'ట్రింగ్ ట్రింగ్... మంటూ ఫోను మోగింది. లిఫ్టు చేశాను. అబ్బాయినుంచి ఫోను.

"నాన్న ఓ రెప్యూటెడ్ మల్టినేషనల్ కంపెనీనుంచి ఇంటర్వ్యూకు కాల్‌లెటర్ వచ్చింది. రిటన్, ఓరల్, గ్రూప్ డిస్కషన్, హెచ్.ఆర్. ఉంటాయనీ... హెడాఫీసు బెంగు ళూర్‌లో..., బ్రాంచాఫీసు హైదరాబాద్‌లో ఉన్నవనీ...!" చెప్పిండు.

"సరే! బాగా ప్రిపేర్ అయి అటెండ్ అవ్వు." అని చెప్పాను.

"అట్లనే నాన్న" ఫోను పెట్టేశిండు. వారంరోజులు గడి చినయి.

మళ్లీ వాణ్ణించి ఫోను.

"హలో నానా ఏమిటి సంగతులు...?"

నేను చిన్నప్పటినుంచి వాడిని ముద్దుగా 'నానా' అని పిలుచుకుంటాను.

"నాన్న అన్ని టెస్టుల్లో సక్సెస్ అయ్యాను. డిజైన్ అండ్ ప్రొడక్షన్ ఇంజ నీర్‌గ అప్పాయింట్ చేశిండ్రు. ఆర్నెల్లు ప్రొబేషన్. ఆ తర్వాత రెగ్యులరైజ్ చేస్త మన్నరు." అని చెప్పిండు. సంతోషప డ్డాను.

దసరా పండుక్కి వచ్చి అపాయింట్ మెంట్ ఆర్డర్ చూపించిండు. వాడి కళ్లల్లో ఏదో దృఢ సంకల్పం కనిపిం చింది. నా ఎద నిండా ఆనందం ఉప్పొం గింది. గతంలో వాడిని మందలించిన తీరు జ్ఞాపకం రాసాగింది. ఆ దృశ్యాలు కళ్లముందు కదలాడినయి.

"అరేయ్ ఆ దోస్తులేంది...? ఆ తిరుగుళ్లు ఏంది...? నువు బాగుపడవురా...!" చెవుల్లో గింగుమంటున్నాయి. ఆ మాటలు. నన్ను ఇప్పుడు వెక్కిరిస్తున్నయి.

గమ్యం లేకుండా తిరిగే కొడుకును జూసి ఏ తండ్రి బాధపడడు. ప్రయోజకుడయిన బిడ్డను జూసి ఏ తండ్రి హృదయం పొంగిపోదు. మా అబ్బాయి విషయంలో అందరి మాదిరి నా గుండెలు తండ్లాడినయి. నా హృదయం తల్లడిల్లింది.

వాడిపుడు కుటుంబ సభ్యులు, జీవితం, సమాజం, వ్యవస్థ, బంధాలు, అనుబంధాలు, మానవ సంబంధాలు అంటే ఏమిటో తెలుసుకుంటున్నడు. నిశితంగా గమని స్తున్నాడు. ఆలోచిస్తున్నాడు. ఇపుడు నాకు మనసులో దిగులుపోయింది. హృదయంలో ప్రశాంతం ఏర్పడింది.

దగ్గరలోని గుడినుండి రోజూ ఆలపించే ఓ అంధుని శ్రావ్యమైన వేణుగానం వాయు తరంగాల్లో మిళితమై మృదుమధురంగ వీనులకు సోకి మనసు పరవశమైపో తోంది. తృప్తిగా గుండెల నిండా ఊపిరి పీల్చుకున్నాను. ★

రచయిత చిరునామా:
**పంజాల జగన్నాథం**
ఇ.నెం.7-2-74/ఎ, మంకమ్మతోట,
కరీంనగర్- 505 001.



ఇంటి వైద్యం

★ తుంగ ముస్తలు (ముస్తకం) రెండుగ్రాములు, వాము ఒకగ్రాము సేవిస్తే అధిక క్రొవ్వు తగ్గుతుంది.